# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

| | | |
|---|---|---|
| సంపుటము ౮. | 12 1921 | చందా సం॥ రు. ౩ |
| సంచిక ౧౧. | కాకినాడ:—శనివారము, ౧౯, మార్చి, ౧౯౨౧. | విడిసంచిక అ ౧. |


## ఓమ్.

సర్వజ్ఞా! నాప్రార్థనలజూచి నాకే అప్పుడప్పుడు సిగ్గగుచుండును. ఏమేమోకోరికలను కోరుచుందును. ఏమేమోప్రతిజ్ఞలను చేయుచుందును. ఏమేమోఅసుతాపాశ్రువుల రాల్చుచుందును. హృదయమును జూడగల నీకు నేను చెప్పవలసినవి ఏమి గలవు? మనస్సులోని ఊహను నీవు తెలిసికొనగలవు. నావాక్కుల యాథార్థ్యమును నీవు కనిపెట్టగలవు. సర్వమును నీకు సువిదితములు. ప్రార్థనచేయుటకే నోరాడుట లేదు. ఎన్నాళ్లు ప్రార్థనచేయుదును? ప్రార్థనానుగుణముగా జీవితమును దిద్దుకొనుటకు సామర్థ్యము చిక్కుట లేదు. కరుణాసముద్రా! నాజీవితమును చక్కపరుపుము. సంతోషముతో నీకడకు జేరెడు యోగ్యతను దయచేయుము. వేయిప్రార్థన లేల తండ్రీ! విశ్వాసపూర్వకముగా నిర్మలమనస్సుతో ఒక్కసారి నిన్ను పిలిచిన జాలదా?

---

ఖడ్గములు మొదలగు నాయుధములు చేయుటకు, ఇనుమును అనేకవిధముల గరగించి పోతపోసినగాని, శ్రేష్ఠమైన ఉక్కుగానేరనివిధమున, మానవుడు పరిపక్వమందుటకు అతని హృదయము తప్తమ్మయి, యనేక కష్టముల పాలైనగాని పరిశుద్ధి నొందదు.

(రామకృష్ణ పరమహంస.)

---

## పాటుపడుట.

పాటుపడుటచేత మనశరీరమునకు దృఢత్వము కూడ గలుగును; ఇంద్రియపటుత్వము చక్కగానుండును. ఇందుకునిదర్శనముగా మనలో పాటు పడరాదను నభిప్రాయముతో మహారాజువలె కాలిమీద కాలు వేసికొని కూరుచుండి సుఖపడుచున్నా మనుకొనుచున్న భాగ్యవంతులును సంస్థానాధిపతులును లావుగా నూరుచున్నను బహులోకముగా అల్పాయుష్మంతులుగాను బలహీనులుగాను సంతానవిరహితులుగాను ఉన్నారు. పాటుపడు జాతులలోనివారు తరుచుగా [illegible]యులుగాను దీర్ఘాయుష్మంతులుగాను సం[illegible]తులుగాను ఉన్నారు. పాటుపడని భాగ్యవంతులు పంచభక్ష్యపరమాన్నములను తిన్నను అజీర్ణాదివ్యాధులచే బాధపడుచున్నారు. పాటుపడుబీదవారు గంజిత్రాగినను మంచి జీర్ణశక్తి గలిగి వజ్రకాయులుగా నున్నారు. అంతే కాక పాటుపడుటవలన దుర్మార్గ చింతనల కెడములేక జనులు సన్మార్గ ప్రవృత్తులగుదురు. పాటుపడక పోవుట యొకటియేకాక మనదేశమును దరిద్రదశకు తెచ్చుటకు మరియొక కారణముకూడ గలదు. మనలో చదువుకొన్న వారందరును వాణిజ్యాది స్వేచ్ఛావృత్తులయందు ప్రవేశించుట తమపరువునకు దగినపని కాదని యెంచి సేవకవృత్తికొరకే కాచుకొనుచున్నారు. చదువుకొన్నవారెక్కువైనకొలదిని ఉద్యోగములు వలసినన్ని దొరకకయు వారు మరియొకవృత్తులలో బ్రవేశింపకయు బీదతనమును పొందువారిసంఖ్య నానాటికి పెరుగుచున్నది. ఎప్పుడును కృషిశిల్పవాణిజ్యాదులచేత దేశముయొక్క కలిమి వృద్ధియగునుగాని సేవకవృత్తిచేత కానేరదు.

(వీరేశలింగ కవి.)

---

# బౌద్ధకాలమందు విద్యాలయములు,

———o:o:o———

వేదకాలమున కన్నను బౌద్ధకాలమున రాజులున్నతవిద్యను దేశమున వ్యాపింపజేయుటకెంతయో యుత్సాహము చూపియున్నారు. కాలమున జగద్విఖ్యాతిగాంచిన విశ్వ విద్యాలయములు తక్షశిల అమరావతి నలంద దూపాంగ, ఉదంతపురి శాక్య, విక్రమశీల మొదలగునవి.

## తక్షశిల విశ్వవిద్యాలయము.

క్రీస్తుశకమునకు పూర్వము ఆరవశతాబ్దమున తక్షశిల విశ్వవిద్యాశిక్షణమునందు చాల ప్రఖ్యాతిగాంచినది. ఇచ్చట విశ్వవిద్యాలయమున కనుబంధముగ ప్రత్యేక పండితోత్తముల యాజమాన్యము క్రింద ౧౮ విధములగు కళలను బోధించుటకు విద్యాలయములు నెలకొల్పబడినవి. ఈ విశ్వవిద్యాలయమున శిల్పము, చిత్రలేఖనము, కర్మవిద్యలకు నెక్కువ ప్రాముఖ్య మీయబడినది. ప్రఖ్యాత వ్యాకరణ కర్తలగు పాణిని చంద్రగుప్తుని ప్రధాన మంత్రి యగు చాణక్యుడు ఈ విశ్వవిద్యాలయమున శిక్షణము బొందిరని చాటుకగలదు.

ఈ విశ్వవిద్యాలయము వైద్యశాస్త్రమున విద్యార్థులను తర్బీతుచేయుటకు పేరుపొందినది. మగధరాజులలో నొకరగు బింబిసారుని రాజవైద్యుడును బుద్ధభగవానునికి దేహ మస్వస్థగనున్న కాలమున వైద్యముచేసి ప్రఖ్యాతిగాంచి నట్టియు జీవకుడు ఈ విశ్వవిద్యాలయమున వైద్యశాస్త్ర పండితులగు ఆత్రేయమహర్షి యొద్ద ... సంవత్సరముల కాలము విద్య నభ్యసించిరి. ఈ విశ్వవిద్యాలయమున నిర్వహింపబడిన పరీక్షా విధానమును గురించి హిందూస్థాను రివ్యూలో రాయబహద్దరు శరశ్చంద్రదాసు బహద్దరుగారిట్లు వ్రాయుచున్నారు.

..జీవకుడు ఏడు సంవత్సరముల కాలము విశ్వవిద్యాలయమున విద్య నభ్యసించెను. తరువాత విశ్వవిద్యాలయము వారతని పరీక్ష చేసిరి. ఆ పరీక్షలో తక్షశిల నగరమునకు ౧౫ మైళ్ళ దూరములోపుగ నున్న ప్రదేశములో మొలచు కూరగాయలు మొక్కలు గడ్డిగడ్డలు మొదలగు వస్తువులలో వైద్యమున కేవి యుపయోగింపవచ్చునో తెలుపుమని జీవకుని విశ్వవిద్యాలయము వారడిగిరి. జీవకుడు నాలుగు దినముల కాలము ఆప్రదేశము నంతటను సంచారము చేసి వస్తువులలో వైద్యమునకు పనికిరాని పదార్థ మొక్కటియైనను లేదని తెలిపెనట. దీని బట్టి ప్రాచీనకాలమున పరీక్షాపద్ధతు లెట్టివో మన మతిసులభముగా కనుగొనవచ్చును.

పది శతాబ్దములవరకు విశ్వవిద్యాలయము తన విఖ్యాతిని నిలుపుకొనినది. క్రీస్తు శకమునకు పూర్వము ౩-వ శతాబ్దమున అశోక మహారాజు భారతభూమి నేలుచుండ విశ్వవిద్యాలయ మత్యున్నత స్థితిలో నుండెను. ఈ విద్యాలయమున విద్య నభ్యసించుటకు రాజపుత్రులు బ్రాహ్మణులు వర్తకులు తండోపతండములుగ వచ్చుచు, భారతకళలను శాస్త్రములను ముఖ్యముగ వైద్యశాస్త్రమును నభ్యసించుచుండెడివారని విన్సెంటు స్మిత్తుగారు వ్రాయుచున్నారు.

## అమరావతి విశ్వవిద్యాలయము.

తక్షశిలకు తరువాత జగద్విఖ్యాతి గాంచినది అమరావతి విశ్వవిద్యాలయము. దీనినే సాధారణముగా చరిత్రకారులు ధాన్యకటక విశ్వవిద్యాలయమని పిలుచుచుండెడివారు. ఇది బ్రాహ్మణ బౌద్ధధర్మశాస్త్రములను బోధించుటలో పేరుగాంచినది. సి. నాగార్జునాచార్యులగారి కాలమున ఈ విశ్వవిద్యాలయమున విద్య నభ్యసించుటకు సింహళము బర్మా చైనా మొదలగు దేశములనుండి విద్యార్థులు వచ్చుచుండెడివారు. హ్యూయనిత్సాంగు అను చైనా యాత్రికుడు నాగార్జునాచార్యుల వారి కాలమున ఆంధ్ర దేశమును సందర్శించుటకు వచ్చినపుడు ఈ విశ్వవిద్యాలయమును చూచి అచ్చట విద్యార్థులకు గరపబడు విద్యావిధానమును చూచి అచ్చెరువొంది కొంతకాల మచ్చటనే యుండెనని అతని యాత్రలను వివరించు గ్రంథముల వలన దెలియుచున్నది. ఇచ్చట విద్యార్థులకు విద్య ఉచితముగా గరపబడుచుండెను. భోజనమజ్జాదులను సైతము విద్యార్థులేమియు నిచ్చుకొననక్కరలేదు. విశ్వవిద్యాలయ పోషణ భారమంతయు ఆంధ్రరాజులె భరించుచుండెడివారు.

## ద్యూపాంగ విశ్వవిద్యాలయము.

అమరావతి విద్యాలయము తరువాత ప్రఖ్యాతిగాంచినది ద్యూపాంగ విశ్వవిద్యాలయము. ద్యూపాంగ అనునది లాసాకు సమీపమున నున్న బౌద్ధుల విహారము. యీవిహారమువారు అమరావతి విశ్వవిద్యాలయ పద్ధతులమీద నీ విశ్వవిద్యాలయమును స్థాపించి చాలకాలము నిర్వహించినారు.

## నలంద విశ్వవిద్యాలయము.

తక్కినవానికన్నను యీవిశ్వవిద్యాలయము బహుశతాబ్దముల వరకు జగద్విఖ్యాతి గాంచినది. యీవిద్యాలయము నలంద విహారము వారిచే నిర్వహింపబడుచుండెడిది. యీవిశ్వవిద్యాలయమున గల విద్యార్థుల సంఖ్య పదివేలకు తక్కువగానుండెడిది గాదట. చక్రాదిత్యబుద్ధగుప్త తథాగతగుప్త బాలాదిత్య మొదలగు విహార దేశపురాజులు యీవిశ్వవిద్యాలయ పోషణమునకు గాను లక్షలకొలది రూప్యములు వ్యయముచేసిరి. బాలాదిత్యుడు విశ్వవిద్యాలయమున కనేక భవనములును నిర్మించెను. యీరాజులకు ముందుకాలము నుండియు యీవిశ్వవిద్యాలయము నిర్వహింపబడుచున్నను బాలాదిత్యునికాలము నుండి మాత్రము (క్రీస్తుశతాబ్దము ౫ వ శతాబ్దము) అత్యున్నతస్థితిలో నుండెను. ౭ వ శతాబ్దమున హాయనుత్స్యాంగు హిందూదేశమునకు వచ్చినపుడు సైతము యీ విశ్వవిద్యాలయము చాల ప్రఖ్యాతి గడించియున్నదని అతని యాత్రల చరిత్రమువలన దెలియుచున్నది.

విశ్వవిద్యాలయపు వైశాల్యము అనేకమైళ్ళు మించియున్నది. ప్రధాన శాస్త్రీకలాశాల విశ్వవిద్యాలయమునకు మధ్యస్థానమున గలదు. గొప్పగొప్ప మందిరములు గలవు. యీమందిరముల కవతలనున్న శాలలలో ఉపాధ్యాయులు నివసించుచుండెడివారు. విశ్వవిద్యాలయపు వాతావరణ యంత్రములు యీమందిరముల

లోపల గలవు. రత్నసాగర రత్నోదధి రత్నరంజక అనునది విశ్వవిద్యాలయము నందలి గొప్ప భవనములు. రత్నోదధి భవనమునకు తొమ్మిది అంతస్థులు గలవు. వీనిలో విశ్వవిద్యాలయపు గ్రంథాలయముగలదు. ఇది ఆ కాలమున భారతదేశమున గల గ్రంథాలయములలో ప్రథానస్థాన మాక్రమించియున్నదని శరశ్చంద్రదాసు గారు తమ గ్రంథమున వ్రాసియున్నారు. హుయానిత్సాంగు విశ్వవిద్యాలయమును సందర్శించిన కాలమున విశ్వవిద్యాలయపు ప్రధాన అధ్యాపకులు ధర్మపాలుని శిష్యులలో ప్రథములగు శీలభద్రి అనువారని ఎస్. దత్తుగారు దక్కా రివ్యూలో సూచించియున్నారు.

ఈ విశ్వవిద్యాలయమున మతవిద్య సామాన్యవిద్యలు బోధింపబడుచుండెడివి. ఇచ్చటి విద్యార్థులు బుద్ధమతమునందలి ౧౮ శాఖల శాస్త్రములను వేదములను చదువుచుండెడివారట. ఇచ్చట నేర్పబడు శాస్త్రములలో ముఖ్యమైనవి వ్యాకరణము తర్కము వైద్యము తత్వశాస్త్రములు. సంస్కృతము పాలి సాహిత్యశాస్త్రములలో సైతము ఇచ్చట విద్యార్థులకు శిక్షణ ఈయబడుచుండెడి దని దత్తాగారు వ్రాయుచున్నారు. తర్కశాస్త్రమున ఈవిశ్వవిద్యాలయము పేరు గాంచినదని హుయానుత్సాంగు వ్రాయుచున్నాడు.

ఈ విశ్వవిద్యాలయమున బౌద్ధమతావలంబకులకు మాత్రమే ప్రవేశముగలదు. విద్యార్థులకు విద్య ఉచితము. విద్యార్థులు విశ్వవిద్యాలయ ఆవరణమునందే నివసించుటకు గాను ప్రత్యేక వసతి భవనములు నిర్మింపబడినవి. భోజన వసతులకు విద్యార్థు లేమియు నీయనక్కరలేదు.

విశ్వవిద్యాలయమున కనుబంధముగ ఆరు కలాశాలలు గలవు. విశ్వవిద్యాలయపు పండితులు గొప్పగొప్ప శాస్త్రజ్ఞులు. నవీన విశ్వవిద్యాలయముల వలెనె ఈ విశ్వవిద్యాలయమున పండితులొక్కొక్కరు ఒక్కొక్క శాస్త్రబోధనమునకు జవాబుదారులుగానుండెడివారు.

తక్షశిల విశ్వవిద్యాలయమున వలె ఇచ్చట కార్మికవిద్య లేవియు బోధింపబడెడివి కావు. ౯ వ శతాబ్దాంతమున విశ్వవిద్యాలయము పడిపోయినదని చరిత్ర గాథలవలన దెలియుచున్నది.

## ఉదంతపురి విశ్వవిద్యాలయము.

నలంద విశ్వవిద్యాలయము పడిపోయిన తదనంతరము బిహారు దేశమున ఉదంతపురి విశ్వవిద్యాలయము వంగదేశ రాజులలో నొకరగు గోపాలునిచే క్రీస్తుశకము ౩౩౦ సంవత్సరమున నెలకొల్పబడెను. ఇచ్చటగల గ్రంథాలయము చాల విఖ్యాతి గాంచినది. కాని గ్రంథాలయమును ౧౧౯౩ సంవత్సరమున ముసల్మానులు అగ్నిహోత్రము పాలుచేసిరి. అంతటితో విశ్వవిద్యాలయము సైతము నామావశిష్టమైనది.

## శాక్య విశ్వవిద్యాలయము.

ఉదంతపురి విశ్వవిద్యాలయ పద్ధతులతో ౧౦౭౩ సం॥ న టిబెటు మతగురువుల పోషణము క్రింద శాక్య విశ్వవిద్యాలయము నెలకొల్పబడినది. ఇచ్చట బౌద్ధమతావలంబకులకే ప్రవేశముగలదు.

## విక్రమశీల విశ్వవిద్యాలయము.

విక్రమశీల బేహారమున గలదు. ఇచ్చట విహారముగలదు. ఈవిహారమువారి పోషణము క్రింద విక్రమశీల విశ్వవిద్యాలయము క్రీస్తుశకము ౮౦౦ సం॥ న సంస్థాపింపబడినది. ఈవిశ్వవిద్యాలయమున కనుబంధముగ ఆరు కలాశాలలు గలవు. ఇవి ఆరుగురు పండితుల యాజమాన్యమున నిర్వహింపబడుచుండెడివి. వనిలో ముఖ్యమైనది శాస్త్రికలాశాల. ఇచ్చట బుద్ధసన్యాసులు ప్రజ్ఞాపరిమిత ధర్మసూత్రములను చదువుచుండెడివారు. ఇచ్చట విద్యార్థులకు భోజనముజ్జనాములు ఉచితముగా నీయబడుచుండెడివి. ఈ విశ్వవిద్యాలయ భవనములన్నిటిని ఆ కాలపు రాజులనేకులు కట్టించిరని తెలియుచున్నది. యీ విశ్వవిద్యాలయము నాలుగు శతాబ్దముల కాలము పేరు గాంచినది. తరువాత ముసల్మానులు హిందూదేశమునకు రాదొడగిరి. దానితో విశ్వవిద్యాలయము నామావశిష్టమైనది."

(ఆంధ్రపత్రిక.)

---

## శ్రీ రామమోహన రాయల పుస్తక భాండాగారము, సిరియం:

---ః౦ః---

శ్రీ రామమోహనరాయల పుస్తకభాండాగారమునకు మ॥ రా॥ శ్రీ ఆర్. పరదేశిగారు దీనబంధు పత్రికయు, జె. బి. రావులుగారు ఆంధ్రవాణిపత్రికయు నుచితముగా రప్పించి యిచ్చుచున్నందులకై మిక్కిలి సంతోషముతో వారికి కృతజ్ఞతాభివందనములు.

అదియునుగాక, గంజాముజిల్లా, పర్లాకిమిడితాలూక కిసిమిబుశిలి గ్రామ కాపురస్థులగు, ప్రస్తుతము బర్మ ఆయిల్ కంపినిలో పెదమేస్త్రి గానున్న మ॥ రా॥ శ్రీ ఎర్నాగుల రామన్నగారు యీభాండాగారమునకు గత ఫిబ్రవరి నెలలో రు ౫ లు యిచ్చుటయేగాక, ప్రతినెలకు రు ౫ లు యిస్తానని వాగ్దానము చేసినందులకు వీరికి కృతజ్ఞతాభివందనములు.

కొన్ని నెలలక్రిందట స్థాపించిన ఈ నూతనభాండాగారమునకు ధనసహాయములలో వీరే మొదటివారు. ఈశ్వరుడు అన్ని కార్యములయందు వీరికి తోడుగా యుండి మా భాండాగారమును అభివృద్ధి తెచ్చుటకై ప్రార్థించుచున్నారము.

ఇట్లు,
బి. సహదేవ.

---

సత్యమేవ జయతే

ధర్మసాధని

శనివారము, ౧౩, మార్చి, ౧౯౨౦.

# అంటుదోషము బాపు హిందూ మహాజనసభ.

ఆంధ్రరాష్ట్రీయ ఆదిహిందువుల మహాసభ ఏలూరులో ఈనెల ౨౮ తేదిన జరుగునని తెలిసి ఆదిహిందువుల ప్రస్తుతకర్తవ్యమేదో తెలుపుచు మేమిటీవల నొక వ్యాసము వ్రాసియుంటిమి. అంటుదోషము తొలగింప బడనంతవరకు, తాము మానవులేయని పరిగణింపబడ నంతవరకు, ఆదిహిందువులు, తమ యాత్మగౌరవము కాపాడుకొనుటకై, హిందువుల ఐశ్వర్యాభివృద్ధులకు తోడ్పడకూడదని చెప్పియుంటిమి. అందునకు వలసిన తీర్మానముకూడ వారు రాబోవు ఆదిమఆంధ్రమహాసభయందు తప్పక గావింపవలెననియు హెచ్చరించితిమి. తమ్ము పాలించు ఆంగ్లేయులతో, తమతోపాటు సమానస్థితియందున్న మహమ్మదీయులతో మైత్రిని బడయుటకు హిందువులు ప్రయత్నించుటలో నేమియు విశేషములేదు. ప్రతి సామాన్యమానవుడు తన సుఖమునకై తనకంటె గొప్పవారితో, తనతోడివారితో సమానప్రాయ నుండుటకు గోరుచునేయుండును. ఈప్రయత్నము ధర్మముకొరకని, దైవముకొరకని చెప్పుటకంటె ఆత్మవంచనము మరొకటియుండదు. ఇతరులు తనయెడ నెట్లు వర్తింపగోరునో, అట్లు తాను ఇతరులయెడ వర్తించుటయందె ధర్మముగలదని బుద్ధుడు మున్నగు మహనీయు లుద్బోధించిరి. 'తనయందు, నిఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరుగువాడు' అని ధర్మవర్తనునికి భాగవతమున నిర్వచనమీయబడెను. ఆది హిందువులను అంటరానివారని పశువులకంటె హీనముగ ఒకప్రక్కను జూచుచు, మహమ్మదీయాంగ్లేయులతో సమానస్వాతంత్ర్యమున మెలంగుటకు ఒకప్రక్కను యత్నించుట హాస్యాస్పదము; ధర్మవిరుద్ధము. మొదట ఆదిహిందువులతో సఖ్యము నెరపిననె గాని హిందువులలో ధర్మభావ ముదయించినదని మేము విశ్వసింపజాలము. ధర్మభావశూన్యులై, తమ యాధిక్యతకొరకు ఎంత విలపించినను, ఎంత పెనగులాడినను లాభములేదు. ప్రపంచము ఈశ్వరనిర్మాణము, ధర్మబద్ధము. ధర్మమె జయించును. అధర్మము అడుగున పడియుండును. ఆదిహిందువులను అంటరానివారని తామె అంటరానివారై ప్రపంచమున నీచాతినీచ జీవనము గడుపవలసిన గతి హిందువులకు పట్టినది. తమ హైన్యమునకు కారణము అధర్మవర్తనమని హిందువులిప్పటికైన గుర్తింపవలెను. అంటుదోషము వెంటనె తొలగింపబడిననె గాని స్వరాజ్యార్హత హిందూదేశమునకు కలుగదని గాంధిమహాత్ముడు స్పష్టముగా చెప్పుచున్నాడు. అతడు అట్లూరక బోధించుటయేగాదు; తానొక పంచమబాలికను పెంచుకొనెను. అతనివలె దేశీయులు సరళహృదయులయిన యెడల, దేశమున కెట్టి కొరతయు నుండదు. హిందువులు ఆదిహిందువుల విషయమున నెట్లు మెలంగుదురో దానినిబట్టియె వారి భావ్యభ్యున్నతియంతయు నాధారపడియున్నదనుటలో సందేహము లేదు.

అంటుదోషమును బాపు హిందూమహాజనసభయు ఏలూరులోనె ఈనెల ౧౯వ తేదిన శ్రీగూడూరి రామచంద్రరావు పంతులుగారి యాధిపత్యమున జరుగనున్నదని వినుటకు సంతోషించుచున్నాము. ఆ సభయందు ఏకొలదిమందియొ వచ్చి కాగితముపై నట్టి యెదో మామూలుతీర్మానమొకటి చేసి మహోపకారము చేసితిమని ప్రకటించుటవలన ఆదిహిందువులు తృప్తిపొందరు; పొందనుగూడదు. దేశమునకు కొలది మాసములలోనె స్వరాజ్యము తీసికొని రావలెనని ఆందోళనము బయలుదేరినది గదా? అంత ఆతురత యుండగూడదని మేము ఆక్షేపించుట లేదు. ఇంతగాదు. ఇంకను ఇంతగూడ ఉండవలసినదె. ఈయాతురతకు తగినంతగ అర్హతను సంపాదించుటకును పూనిక యుండవలెనని మాత్రము గోరుచున్నాము. జపానీయులు ఔన్నత్యము బడయగోరిరి. మనదేశములో ఇప్పుడున్న నిమ్నోన్నత భేదముల వంటివి వారిలో గూడ నుండెను. వారు వానినన్నిటిని ఒక క్షణములో కొట్టివేసిరి. స్వదేశమున మానవసమానత్వము స్థాపించిరి. ప్రపంచమున తమస్థానము బడయగలిగిరి. నేడు హిందువులలో గూడ అభివృద్ధిపొందవలెనని యథార్థమె

ఆకాంక్ష జనించినయెడల, జపానీయులలో కలిగిన సత్వరసాంఘిక పరివర్తనములు వారియందును కలుగవలెను. ఏలూరులో జరుగబోవుసభకు సత్వర స్వారాజ్యాందోళనము జరపు ప్రయత్నము ముఖ్యముగ రావలెను. 'అంటుదోషమును నేటినుండి మేము ఏవిధముగను పాటింపము. ఆదిహిందువులను సోదరులవలెజూచెదము' అని ప్రతిజ్ఞను గైకొనవలెను. ఆప్రతిజ్ఞ హిందువులెల్లరు తీసికొని పాలించునట్లు చేయవలెను. ఇట్టి సానుభూతియు, ఉదారవర్తనమును హిందువులు కనబరచగలిగినయెడల, ఆదిహిందువులు వారికి సహజముగనె సాహాయ్యముచేయుదురు. లేనియెడ, స్వారాజ్యోద్యమమునకె కాక మామూలు పనులలోను ఆత్మగౌరవమునకు భంగకరముగ హిందువులకు ఆదిహిందువులు తోడ్పడగూడదనియె మేము తిరిగిచెప్పుచు మహాత్మాగాంధిగారి యీక్రిందిమాటలను బాగుగ గమనింపవలసినదని యెల్లరిని గోరుచున్నాము.

"అంటరానితన మనే నేరముచేసినందుకు ధర్మదేవత మనను నీరీతిగా దండించలేదా? ఏవిత్తు నాటితిమో ఆపంట అనుభవించుచున్నాము. మనము మనపంచమసోదరులను డయ్యారు, ఓడయ్యారులవలె క్రూరముగా బాధించలేదా? మనము మాల మాదిగలను ఊరుబయట దూరముగానుంచితిమి. దీనికి ఫలితముగా మనలను బ్రిటీషు కాలనీలలో ఊరుబయట దూరముగా నుంచుచున్నారు ... ... ... ... ...
...... వారి కేవో నాలుగు కొరకమాలిన పాఠశాలలు పెట్టినంతమాత్రమున మనబాధ్యత తీరదు. వారిని జూచి మనము గొప్పవారమని విర్రవీగరాదు. నిజముగా వారూ మనమూ ఒకతల్లి బిడ్డలము. గాన వారిని సోదరులవలెనే చూడవలెను. వారికి సహజముగానుండు హక్కులను, స్వాతంత్ర్యములను మనము అపహరించితిమి. తిరిగి వారికి ఇచ్చివేయవలెను. ఈపని ఇంగ్లీషు చదువుకున్న యెవరో నలుగురు సంస్కార ప్రియులు చేసి లాభములేదు. హిందూదేశమందలి జనులందరూ చక్కగా తెలుసుకొని బుద్ధిపూర్వకముగా చేయవలెను. ఇదివరకే యెప్పుడో జరిగియుండవలసిన యీమార్పు చేయుటకు కల్పాంతమువరకు ఆగవలసిన పనిలేదు. సాధనచేయుచున్న యీయేడాదిలోగా, తపస్సుకు ప్రారంభించిన యీసంవత్సరము లోగా, మన మీసంస్కరణను చేసితీరవలెను. దీనిని స్వారాజ్యము వచ్చేవరకు ఆపియుంచుటకు వీలులేదు. ముందు యీమార్పు చేసి కొండోసారాయి మాన్పవలెను."

---

ప్రశంసార్హమైన విషయము:—

కలకత్తాలో మద్యపానమునందు వచ్చు ఆదాయము మరిపి ౧కి రు౧౧లు చొప్పున నున్నదనియు, నిషేధకసంఘమువారి ప్రయత్నములచే 13 కల్లుదుకాణములును, 6 పెద్దసారాయి అంగళ్ళును పూర్తిగా మూసివేయబడినవనియు, మరి 32 దుకాణములు అమ్మకములు లేక అధికనష్టములకు పాల్పడుచున్నవనియు, అనేకమంది యువకులు మద్యమును ముట్టమని ప్రమాణములను చేసియుండిరనియు కలకత్తా మద్యపాననిషేధసంఘ కార్యదర్శి జ్ఞానాంజన నియోగిగారు తమ ఉపన్యాసమునందు చెప్పిరి. అసహాయోగమునందు విద్యాగంధములేని బీదజనులు మద్యపానమును మానివిద్యార్థులవద్దకుబోయి 'అయ్యా మేము మానితిమి. మీరును మానినయెడల దేశమునకు మహోపకారమగు' నని హెచ్చరించుచున్నారట.

గుడివాడలోని మహమ్మదీయులు ౨౪-౨-౨౧ తేదిన పీర్లపంజాయందు సమావేశమయి సారాయి మొదలగు మత్తుపదార్థముల నుపయోగింపమని ప్రమాణపత్రమును వ్రాసికొనిరి. సభకు ౪౦౦ మంది వచ్చిరట.

---

ఆయుర్వేదౌషధములు వాడుడు:—

చెన్నపురివాస్తవ్యులును, ఆయుర్వేదవైద్యులును అగు డాక్టర్ కె. ఎన్. కేసరిగారు అలోపతివైద్యులకొక విజ్ఞప్తి నంపిరి. ఆయుర్వేదౌషధములు అలోపతియౌషధములకన్న నెక్కువ బాగుగ పనిచేయుననియు, మనదేశములోని మూలికలెన్నో విదేశములకు కొనిపోబడి ఔషధములుగ తయారుచేయబడి తిరిగి మనకు పంపబడుచున్నవనియు, ఈకరప్రదినములలో అట్టిమందులకొరకు అనావశ్యముగ నెక్కువసొమ్ము వెచ్చింపబడవలసి వచ్చుననియు, ఆయుర్వేదౌషధములను పరీక్షించి శ్రేష్ఠతగుర్తించి మనదేశములో అలోపతివైద్యులు గూడ వానినె వాడుటకు ప్రారంభించిన, విశేషధనము వ్యయముచేసి మందులు కొనజాలని బీదదేశీయులకు గొప్పయుపకారము కలుగగలదనియు, డాక్టర్ కేసరిగారు అందు తెలిపిరి. అలోపతివైద్యులు వారి సలహాను ఆలోచనములోనికి తీసికొందురని నమ్ముచున్నాము.

---

# నిర్మూలము చేయుడు, ఇదియే సమయము.

—:o:—

[వి. టి. శాస్త్రిగారు.]

సహాయనిరాకరణ ఉద్యమములో మద్యపాన నిషేధమునగూడ జేర్చి గాంధిమహాత్ముడు మహోపకారమును జేసినాడు. మద్యము మొదలగు మత్తు పదార్థములను తయారుచేయుటయందుగాని విక్రయించుటయందుగాని లేక పానము చేయుట యందుగాని యెట్టిసంబంధమును పెట్టుకొనక సహాయనిరాకరణమును గావించుటవలన హిందూదేశమునకు మితిలేని క్షేమము చేకూరును. మతప్రచారకులు, పరోపకారపారీణులు, ఉపాధ్యాయులు, వర్తకులు వీరు వారననేల సమస్త జనులును యీవిధమైన సహాయనిరాకరణమునందు చేరుటకేమియు నభ్యంతరముండదు. జాతిమతభేదములను పాటింపక భారతదేశమునందు నివసించు సమస్త మానవులును యీమద్యపాననిషేధ ఉద్యమ నాయకులకు సంపూర్ణ సానుభూతితో తోడ్పడ వచ్చును.

దేశ మీబంధమునుండి విడివిడ బోవునప్పుడు దేశమునకు పన్నుమూలమున రాబోవు ధన నష్టము నెంతయైనను సరకుచేయవలసిన పనిలేదు. దేశము యీమద్యపాన పిశాచము బారినుండి తప్పించుకొని తన జాతీయగౌరవమును నిలువబెట్టుకొనుటకై చేయు ప్రయత్నములందు ముఖ్యముగా మిషనరీలు, ఆంగ్లేయులును, అమెరికనులునుగూడ తోడ్పడవలసియున్నారు. సారాయము మొదలగు మత్తుపదార్థములను పానీయములుగా నిషేధించుటగూడ సహాయనిరాకరణమునందు చేర్చి ప్రయత్నములను సఫలము గావించగలిగిన యెడల వీరికేమియు నభ్యంతర ముండగూడదు ఈ నిషేధము వలన హిందూదేశ ఆదాయము చాలతగ్గి నష్టము సంభవించుననుట సత్యము. కాని యీమద్యపానమును దేశములనుండి పారదోలిన యెడల ప్రజలకు యితరవిధములుగా గలుగు లాభము అపరిమితము. త్రాగుడును మానిన యెడల దేశమున కేవిధముగను నష్టము సంభవింపదని అమెరికాఖండము సోదాహరణ పూర్వకముగా నాగరిక ప్రపంచమునకు చాటుచున్నది. ఈపిశాచమున కింకను లొంగి దాస్యముచేయుచున్న ఇంగ్లాండు, ఫ్రాన్సుదేశములు ప్రపంచిక ఐశ్వర్యమునే బడయుటకు నిజముగా కోరుకొనె నేని ఒక్క నిమిషములో యీమద్యపానమును ఆపివేయవలసిన అవసరమును గమనించి ఆపివేసియుందురు. కుటుంబములలో గాని, సంఘములలో గాని, రమ్ము సారాయమువంటి నిషావస్తువులను ఉపయోగించుట వలన దేశముయొక్క వర్తక వ్యాపారములకు లాభము కలుగునని చెప్పి ఒప్పింప జూచు వాదముల కాలము వెళ్లిపోయినది.

మద్యపాన నిషేధముయొక్క అగత్యము కనబడినప్పుడు, దానివలన దేశమునకు కలుగబోయెడి ధన నష్టము ఉద్యమనాయకులకు ధైర్యమును పోగొట్టుటకు సిద్ధపడినప్పుడే, దేశములో నైతిక సాహసము కావలసిన సమయము. సారాయము మీద ధ్వజమెత్తి యుద్ధము జరుపుటకు సందేహించవలసిన కాలము కాదిది. భారతదేశము నుద్ధరించుటకు సాత్వికస్వభావులైన జనులు కావలసియున్నారు. మద్యపానమును దేశమునుండి పారదోలి సరళ హృదయులను దేశమునం దుద్భవింప జేసితిమేని వారినుండి అనేక సద్విషయములు బయలువెడలి ప్రపంచమునకు మహోపకారము జరుగగలదు. ఇదియే సమయము. మద్యపానమును నిర్మూలము చేయుడు.

(ఇండియన్ విట్నెస్.)

—

# నిమ్న జాతుల అంటుదోషమును బాపు హిందూ మహాజన సభ.

—:-:—

ఈసభ మార్చి ౧౯వ తేదిన యేలూరు పట్టణమున గుడివాడ వాస్తవ్యులును నిమ్నజాత్యభివృద్ధికై ఆహర్నిశలు పాటుపడుచున్న మ॥ రా॥ శ్రీ గూడూరి రామచంద్రరావు పంతులుగారి అధ్యక్షతక్రింద జరుగును. ౨౦ తేదిని ఆదిమ ఆంధ్రసభ హైదరాబాదు వాస్తవ్యులును మ॥ రా॥ శ్రీ భాగ్యరెడ్డి వర్మగారి అధ్యక్షతక్రింద జరుగును. హిందూ మహాజనులును పంచమ సోదరులును ఈసభకు రాగలందులకు వేడుచున్నాము. గుజరాతు, బొంబాయి, హైదరాబాదు మొదలగు చోట్లనుండి పెక్కుమంది ప్రతినిధులు సభకు వచ్చుచున్నారు.

ఇట్లు,
రాయుడు గంగయ్య,
యెత్తైల సూర్యనారాయణ,
నరాల శెట్టి దేవేంద్రుడు.

—

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
***Promptly and Neatly***
***executed.***

## యోగము.

పరోక్షము: అపరోక్షము.

ధర్మజీవనమునకు తోడ్పడు ఉత్తమ గ్రంథరాజము.

భక్తాగ్రేసరులు.

బ్రహ్మానంద కేశవచంద్రునిచే

విరచితమగు

సుప్రసిద్ధ గ్రంథమునకు

ఆంధ్రీకృతము.

నెల వీ. పీ. ఖర్చులతో **5** అణాలు.

వలయువారు:—

ధర్మసాధనీ కార్యస్థానము,
కాకినాడ.
అని వ్రాయవలయును.

## కేసరి—పత్రత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్ఠ కాకుండుట, అకాల బహిష్ఠి, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసమస్త వ్యాధులను కుదుర్చును. 24. ఔ రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 ఔ రు 2-8-0; 3 ఔ రు 1-8-0; 1 ఔ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,
ఎగ్మోర్, మదరాసు.

## P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీ వెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

32. రక్తశుద్ధి:—మానవశరీరమునకు నెత్తురు ఆవశ్యకమను సంగతి నెల్లరకు విశదమేగదా రక్తము చెడినయెడల అన్నిరోగములును బుట్టును. అనగా నోటిపూత, కండ్లకలక, ముక్కులో పురుగులు, కురుపులు, రణములు, పాండువ, సవాయి, తలనొప్పి, అజీర్ణము, చర్మ మెండుట, కండ్లలో పొడ, నంబు, కుష్ఠు, తామర, శరీర దుర్గంధము. అనుచి ఇత్యాదిరోగములకు గుణమైన ఔషధము. విషములను తీసివేయును, బలమును సౌందర్యమును ఇచ్చును. ఇరువదిరోజులు వాడతగినంత డబ్బి 1 కి 2 రూపాయలు, వి. పి. ఒకటి మొదలు రెండువరకు 7 అణాలు ప్రత్యేకము.

33. సిద్ధమకరధ్వజము:—హిందూ వైద్యశాస్త్రమందు గొప్ప విలువగల యౌషధము. అన్నివిధములగు జ్వరములకు, అజీర్ణములకు, వాతనొప్పులకు, క్షయదగ్గులకు మిగుల యుపయోగకరమైనది. దీని వాడుక చేసిన నూరు సంవత్సరములుయినను మగతనము పోదు. తులం 1 కి 80 రూపాయలు ఒక వారపు మందుకు 3 రూపాయలు, వి. పి. చార్జి ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన వ్రాయబడినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క పట్టీలను కోరువారికి ఉచితముగా పంపబడును.

## అమృతాంజనము.

సుందరమైన **1921** ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనే వ్రాసుకొనవలయును.

| కామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

**అమృతాంజనము డిపో,**

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.

శ్రీమాన్ వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

55, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలుకంటె చౌకగా మందులు విక్రయింపబడును.

ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. ఇతరేతర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

పం. మాధవస్వామి (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము } డి. దేశికాచార్యులు,

పండిట్, మదరాసు. } జాయింటు ప్రొప్రయిటర్లు.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ " | " 40 | " 24 | " 16 |
| ¼ " | " 24 | " 16 | " 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానే చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


**V. P. Rs. As.**

**To M. R. Ry.**

61 Jayanti Gaganna garu B. A., L. T.,